క్లుప్తంగా

క్షేత్రపాలకుడికి ప్రత్యేక పూజలు


వీరభద్రస్వామికి పూజలు నిర్వహిస్తున్నఅర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలోని శ్రీస్వామిఅమ్మవార్ల ఆలయ ప్రాంగణంలో శనగన బసవన్నగా పేరుపొందిన నందీశ్వరునికి, శ్రీశైల క్షేత్రపాలకుడిగా ప్రసిద్ధిగాంచిన శ్రీబయలువీరభద్ర స్వామి వారికి మంగళవారం సందర్భంగా శాస్త్రోక్తంగా ఈఓ ఎస్‌లవన్న, అర్చకులు విశేషపూజలను నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రదోషకాల సమయంలో క్షేత్రపాలకుడైన వీరభద్రునికి, నందీశ్వరునికి పంచామృతాలతో అభిషేకాధి అర్చనలను నిర్వహించారు. ఆరంభ పూజలలో భాగంగా లోకక్షేమాన్ని కాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. అనంతరం ఈ కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు గణపతి పూజ చేశారు. తరువాత నందీశ్వర స్వామికి నూతన వస్త్రసమర్పణ ,విశేషార్చనలను, నానపెట్టిన శనగలను, క్షేత్రపాలకునికి ప్రత్యేక నైవేద్యాన్ని సమర్పించి కర్పూర నీరాజనాలు అర్పించారు.

కుమారస్వామికి విశేషపూజలు

స్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమార స్వామి ఉపాలయంలో విశేషక్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకం, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్ర పారాయణలు చేశారు. స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

శ్రీశైలానికి ప్రత్యేక బస్సులు

ఆత్మకూరు: ఆత్మకూరు ఏపీఎస్ ఆర్‌టీసీ డిపో నుంచి ఉగాది పర్వదినం సందర్భంగా శ్రీశైల మహాక్షేత్రానికి ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు ఆత్మకూరు ఆర్టీసీ డిపో మేనేజర్ మహేంద్రుడు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆత్మకూరు ఆర్టీసీ డిపో నుంచి శ్రీశైలానికి 35 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు చెప్పారు. ఉమ్మడి జిల్లాల్లోని ఆదోని, ఎమ్మిగనూరు,. కర్నూలు, నందికొట్కూరు, నంద్యాల తదితర డిపోల నుంచి 260 బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గతేడాది 220 బస్సులు నడిపామని ప్రస్తుతం మరో 40 బస్సు సర్వీసులను అదనంగా కేటాయించినట్లు వెల్లడించారు. వివిధ డిపోల నుంచి ఈ బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు చెప్పారు. కర్ణాటక భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉగాది ఉత్సవాలకు మహానంది ముస్తాబు


విద్యుద్దీపకాంతుల్లో రాజగోపురం

మహానంది: ఉగాది ఉత్సవాలకు మహానంది ఆలయం ముస్తాబైంది. ఉగాది పర్వదినం సందర్భంగా మహానందిలో బుధవారం విశేష పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆలయ రాజగోపురం, మహాద్వారం, సుపథ మండపాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. స్వామి, అమ్మవార్లకు విశేష, అభిషేక అర్చనలతో పాటు తిరుమంజనం, పంచాంగశ్రవణం, ఉగాది పచ్చడి పంపిణీ ఉంటుందని వేదపండితులు రవిశంకర అవధాని చెప్పారు. బుధ, గురువారాల్లో నిరంతరదర్శనం ఉంటుందని తెలిపారు.

బరక సంజీవరాయుడికి ప్రత్యేక పూజలు


స్వామి మూలవిరాట్

మిడుతూరు: మండల పరిధిలోని రోళ్లపాడు అభయారణ్యంలో వెలసిన శ్రీ బరకసంజీవరాయ స్వామివార్లకు అమావాస్యను పురస్కరించుకొని మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో ఉదయం స్వామివార్లకు అభిషేకం, విశేషపూజలను పురోహితులు నరహరి శర్మ, వెంకటేశ్వర్లు, కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా చేపట్టారు. మన్యసుక్త హోమం, స్వామివారికి పల్లకీసేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పేరెడ్డి మురళీ మోహన్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడండి

బండిఆత్మకూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఎంపీపీ దేరెడ్డి చిన్నసంజీవరెడ్డి ఆదేశించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తాగునీటి సమస్యపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తహసీల్దార్, ఎంపీడీఓ, ఈఓఆర్‌డీల ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యలను పంచాయతీ కార్యదర్శులు గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వాసుదేవగుప్త, తహసీల్దార్ ఉమారాణి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ లక్ష్మి నరసింహ పాల్గొన్నారు.


వీరాచార విన్యాసాల్లో భాగంగా అగ్నిగుండ ప్రవేశానికి సిద్ధమవుతున్న వీరశైవులు


చేకితి శూలం గుచ్చుకున్న భక్తుడు


పెదవికి శూలం గుచ్చుకున్న దృశ్యం


వాహనాల పార్కింగ్

ఆధ్యాత్మిక ఉత్సవాలు..

భక్తజన సంబరాలు

- శ్రీగిరిలో వైభవంగా కొనసాగుతున్న ఉగాది మహోత్సవాలు
- ఉత్సవాలను తిలకించేందుకు తరలి వచ్చిన లక్షలాది మంది కన్నడ భక్తులు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో కొనసాగుతున్న ఉగాది మహోత్సవాలు ఆధ్యాత్మిక భరితంగా సాగుతున్నాయి. శ్రీశైలంలో ఉగాది మహోత్సవాలు మూడవరోజుకు చేరుకున్నాయి. ఉత్సవాలను తిలకించేందుకు భక్తులు లక్షలాదిగా శ్రీగిరికి చేరుకున్నారు. ఉత్సవాలను కన్నులారా చూసిన కన్నడ, మరాఠ భక్తులు ఆనందాలతో సంబరాలు చేసుకుంటున్నారు. భక్తులు వేకువజామున్నే పాతాళ గంగలో పుణ్యస్నానాలు ఆచరించి, గంగమ్మకు ప్రత్యేక పూజా హారతులిచ్చి, వాయనం సమర్పిస్తున్నారు. అనంతరం మల్లికార్జున స్వామివారి దర్శనానికి కన్నడ భక్తులు బారులు తీరారు. భక్తులందరికీ మల్లన్న అలంకార దర్శనాన్ని మాత్రమే కల్పిస్తున్నారు. అమావాస్య కావడంతో మల్లన్న దర్శనానికి కన్నడ భక్తులు పోటెత్తారు. రాత్రి 11 గంటల తరువాత అమావాస్య ఘడియలను పురస్కరించుకొని వీరశైవులు వీరాచార విన్యాసాలు ప్రదర్శించారు. కర్ణాటకకు చెందిన వీరశైవ భక్తులు ప్రత్యేక వేషధారణలో వీరభద్ర ప్రవచనాలు పఠిస్తూ అగ్నిగుండ ప్రవేశం, శూలాలు, ఇతర అస్త్రాలను తమ చెంపలు, నాలుక, పెదవులు, కడుపు, చేతుల్లోకి గుచ్చుకున్నారు. ఈ విన్యాసాలు చూపరులను ఆశ్చర్యానికి గురిచేశాయి.


భక్తులతో కిక్కిరిసిన ప్రధాన పురవీధులు

దశాబ్దాలుగా భక్తుల సేవలో..


పోషకాహార అంబలి, రాగిజావను తయారు చేస్తున్న దృశ్యం,


భక్తులకు పంపిణీ చేసేందుకు లక్ష లడ్డూలు సిద్ధం చేసిన దాతలు


సాక్షిగణపతి వద్ద రొట్టె, పప్పుచారు పంపిణీ చేస్తున్న దృశ్యం

శ్రీశైలం : శ్రీశైలమహాక్షేత్రానికి ఉగాది మహోత్సవాల సందర్భంగా పాదయాత్రగా అలసి వచ్చే లక్షలాది మంది కన్నడ భక్తులకు పౌష్టిక ఆహార పదార్థాలను కర్ణాటక, మహారాష్ట్రలకు చెందిన దాతలు ఉచితంగా అందజేస్తున్నారు. సాక్షిగణపతి సమీపంలో బీజాపూర్‌జిల్లా, మషేబినాథ్‌కు చెందిన పరమానంద దాసోబు సమితి వారు భక్తులకు అంబలి, రాగిజావ, సంకటి తదితర పదార్థాలను గత 21 సంవత్సరాలుగా ఉగాది ఉత్సవాల్లో అందజేస్తున్నారు. వీటితో పాటు రాగులు, జొన్నలు, శనగల, అలసందలు తదితర తృణధాన్యాలను ఉడికించి గుగ్గిళ్ల రూపంలో భక్తులకు అందిస్తున్నారు. వీటిని తిని, జావ తాగిన వారికి నిస్సత్తువ పోయి, అలసట తీరి శక్తి పొందుతారని దాత తెలియజేశారు.

50 ఏళ్లుగా భక్తులకు లడ్డూ ప్రసాదం

50 ఏళ్లుగా షోలాపూర్ అక్కల్‌కోట్‌కు చెందిన ఖెడ్గీ కుటుంబం వారు 300 మంది సభ్యులతో ఉగాది ఉత్సవాల ఆరంభం నుంచి స్థానిక జిల్లా పరిషత్ గెస్ట్‌హౌస్ వద్ద లక్ష లడ్డూలను తయారు చేస్తారు. అయితే ఈ లడ్డూ ప్రసాదాన్ని ఉగాది రోజున స్వామిఅమ్మవార్లను దర్శించుకుని వెలుపలకు వచ్చే ప్రతి భక్తుడికి ఒకటి చొప్పున ఉచితంగా అందజేస్తామని ఖెడ్గే కుటుంబీకులు తెలిపారు. 30 ఏళ్ల క్రితం చెక్కరతో తయారు చేసిన ప్రసాదాన్ని తమ తాతగారి హయాంలో ఉగాది భక్తులకు అందించేవారం, నాన్నగారి తరం వచ్చాక లడ్డూను ప్రసాదంగా ఇవ్వాలనే ఆలోచనతో ముందుగా 25 వేల నుంచి ప్రస్తుతం లక్ష లడ్డూలను పంపిణీ చేస్తున్నామని చెప్పారు.

ఐదు అన్నదాన శిబిరాలు

కర్ణాటక రబకై బండగి తాలూకాకు చెందిన జ్ఞానేశ్వర్ మహారాజ్ ఆధ్వర్యంలో కైలాసద్వారం, హఠకేశ్వరం, సాక్షిగణపతి, పాతాళగంగ వద్ద 5 అన్నదాన శిబిరాలను ఏర్పాటు చేశారు. ఇక్కడ రొట్టె, పప్పుచారు, పెరుగన్నం తదితర వాటితో ఉదయం 6 నుంచి రాత్రి 11 గంటల వరకు వచ్చిన భక్తులందరికీ లేదనకుండా వడ్డిస్తారు. ఉగాది పర్వదినం రోజు వరకు ఈ కార్యక్రమం నిరంతరం కొనసాగిస్తుండడం విశేషం. కాగా సంబంధిత దాతలు తాము ఏ మేరకు ఖర్చు చేస్తున్నామన్న వివరాలను తెలియజేయక పోవడం అంతా భగవాతానుగ్రహమే చెప్పడం గమనార్హం.

ఎమ్మార్పీకే విక్రయించాలి

మహానంది: మహానందీశ్వరస్వామి ఆలయ పరిసరాల్లో వ్యాపారాలు నిర్వహించుకునేవారు వస్తువులను ఎమ్మార్పీలకే విక్రయించాలని మహానంది ఎస్‌ఐ సీసీ నాగార్జున రెడ్డి ఆదేశించారు. మహానందికి కన్నడ భక్తులు తరలివస్తున్న నేపథ్యంలో మంగళవారం వ్యాపారులతో స్టేషన్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. అధిక ధరలకు విక్రయిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

శ్రీశైలంతో వీరశైవులది వీడదీయరాని బంధం

- మల్లన్న స్వామికి నిత్య కైంకర్యాలు సమర్పించేది వీరశైవులే
- మల్లన్న ఆలయంలో అర్చకులూ వారే

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రం వీరశైవులకు అత్యంత ప్రాధాన్యతమైన క్షేత్రం. ఈ క్షేత్రంలో స్వయంభూ లింగంగా వెలసిన శ్రీమల్లికార్జున స్వామి వీరి ఆరాధ్య దైవం. శ్రీశైల మహాక్షేత్రంతో వీరికి వీడదీయరాని అనుబంధం ఉంది. వీరశైవుల్లో అత్యంత ప్రముఖులైన పలువురు మల్లికార్జున స్వామివార్ల సేవలో సేవించి తరించారు. వీరిలో ప్రముఖులు అక్కమహాదేవి, సిద్ధరామేశ్వరుడు, హేమారెడ్డి మల్లమ్మకు ఎంతో విశిష్ట స్థానం ఉంది. అక్కమహాదేవి స్వామివారిలో ఐక్య మవ్వాలని తపస్సు చేసి సిద్ధిపొందింది. స్వామి ఆలయంలో నిత్య కైంకర్యాలు నిర్వహించేది కూడా వీరశైవులే.


శ్రీశైల ఆలయంలో అక్కమహాదేవి విగ్రహం

మల్లికార్జున స్వామికి వీరశైవాగమ సారంగ నిత్య కైంకర్యాలు

శ్రీశైలమల్లికార్జునస్వామివారికి వీరశైవాగమ సారంగా ఆయా కైంకర్యాలను నిర్వహిస్తారు. మల్లికార్జునస్వామి ఆలయంలో అర్చకులుగా వీరశైవులు పూజలు నిర్వహిస్తారు. శ్రీశైల దేవస్థానం వీరశైవ ఆగమం కోసం ప్రత్యేకంగా వీరశైవ ఆగమపాఠశాలను ఏర్పాటు చేసి అర్చకబోధన చేస్తుంది. ప్రతి ఏటా సుమారు 120 మందికి పైగా అర్చకులు ఈ ఆగమ పాఠశాల నుంచి విద్యనభ్యసిస్తున్నారు.

విధులు సక్రమంగా నిర్వర్తించాలి

జూపాడుబంగ్లా: సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సక్రమంగా విధులు నిర్వర్తించాలని తహసీల్దార్ పుల్లయ్యయాదవ్ సూచించారు. మంగళవారం ఆయన జూపాడుబంగ్లాలోని సచివాలయం–1, 2ను తనిఖీ చేశారు. విధులకు సకాలంలో హాజరుకావటంతో పాటు ఫేషియల్ యాప్‌లో అటెండెన్స్ వేయాలని సూచించారు. ఓటరు కార్డుతో ఆధార్ కార్డును లింకప్‌చేసే కార్యక్రమాన్ని త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. అనంతరం ప్రజలతో మాట్లాడారు. ప్రజలకు పూర్తిగా సహకరించాలని నిర్వాహకులకు సూచించారు.

మొబైల్ ఆధార్ కేంద్రాల పరిశీలన

పగిద్యాల: మండలంలోని పగిద్యాల, ప్రాతకోట గ్రామాల్లో చేపట్టిన మొబైల్ ఆధార్ కేంద్రాలను ఎంపీడీఓ వెంకటరమణ మంగళవారం పరిశీలించారు. ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన మొబైల్ ఆధార్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మద్దతు ధరపై బిల్లు పెట్టాలి

జూపాడుబంగ్లా: అన్నిపంటలకు మద్దతు ధరను ప్రకటిస్తూ కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు నాగేశ్వరరావు, రైతు సంఘం నాయకుడు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. జీపుజాతాలో భాగంగా మంగళవారం పారుమంచాల గ్రామంలో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ 2022 విద్యుత్ సంస్కరణ బిల్లును రద్దుచేసి రైతులకు ఉచితంగా కరెంటు సరఫరా చేయాలన్నారు. అనేక సమస్యల పరిష్కారం కోరుతూ ఏప్రిల్ 5న చలోఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పక్కీర్‌సాహెబ్, కర్ణ, శివ, మదార్‌బీ, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

భార్యాభర్తలపై దాడి.. ఐదుగురిపై కేసు నమోదు

జూపాడుబంగ్లా : తమ బిడ్డ కనిపించకుండా పోవడానికి కారకులనే అనుమానంతో భార్యాభర్తలపై ఐదుగురు దాడిచేసిన ఘటన మండలంలోని తాటిపాడు గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ఖాసీంసాహెబ్ కుమార్తె మూడు రోజుల క్రితం కనిపించకుండా పోయింది. అందుకుగాను గ్రామానికి చెందిన మాసుంబాషా, అతని భార్య షాకీరాబీలే కారణమనే అనుమానం పెంచుకున్నారు. మూడు రోజులైనా తమ బిడ్డ తిరిగిరాకపోవడంతో ఆవేశానికిలోనైన ఖాసీంసాహెబ్, అతని భార్య మాలాబీ, కొడుకులు మాసుం, చిన్నమాసుం, మాబాషా కలిసి వారిపై దాడిచేసి కొట్టారు. మాసుంబాషా తలకు రక్తగాయాలు కాగా, షాకీరాబీకి స్వల్పగాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు దాడి చేసిన ఐదుగురిపై కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీ.. ఉపాధి కూలీలకు గాయాలు

జూపాడుబంగ్లా: ఉపాధి పనులకు వెళ్తున్న కూలీలను వెనుకనుంచి ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం 80బన్నూరు సమీపంలో చోటుచేసుకొంది. కర్నూలు డిపోకు చెందిన బస్సు శ్రీశైలం నుంచి కర్నూలుకు వెళ్తున్న బస్సు మార్గమధ్యలో నడుచుకుంటూ వెళ్తున్న ఇరువురు కూలీలను వెనుకనుంచి ఢీకొంది. దీంతో రమణమ్మ, వెంకటలక్ష్మమ్మ తీవ్ర గాయాలు కావటంతో వారిని 108సిబ్బంది చికిత్సనిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరితో పాటు వెళ్తున్న మరో ఐదు మంది త్రుటిలో తప్పించుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు బస్సు డ్రైవర్ రవికుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పౌష్టికాహారంతో కంటివ్యాధులు దూరం


కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు

మహానంది: తక్కువ ధరలకే లభించే ఆకు, కాయగూరలు నిత్యం తీసుకోవడం ద్వారా కంటి వ్యాధులు రాకుండా చూసుకోవచ్చని జిల్లా అంధత్వ నివారణ సంస్థ కంటి వైద్యాధికారి కృష్ణమోహన్‌రెడ్డి తెలిపారు. డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా గోపవరంలో మంగళవారం కంటి వైద్యపరీక్షలు నిర్వహించారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఎంపిక చేసిన ఆస్పత్రులలో ఉచితంగా కంటిలో అద్దాలు అమర్చే ఆపరేషన్లు చేస్తారన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ హుసేన్‌రెడ్డి, కార్యదర్శి భాస్కర్ పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యానికి రాగిజావ

నందికొట్కూరు: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల ఆరోగ్యం కోసం ప్రభుత్వ పాఠశాలల్లో రాగిజావ అందిస్తోందని మున్సిపల్ చైర్మన్ సుధాకరరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో రాగి జావ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

పాములపాడు: మండలంలోని తుమ్మలూరు గ్రామంలో రాగి జావ పంపిణీ కార్యక్రమాన్ని ఎంఈఓ బాలాజీనాయక్ ప్రారంభించారు. పాములపాడులోని ఏఎస్‌ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులు రాగి జావ అందించడం పై ఆనందం వ్యక్తం చేస్తూ థ్యాంక్యూ జగన్ మామయ్య అంటూ విజయకేతనం చూపిస్తూ నినాదాలు చేశారు.

జూపాడుబంగ్లా: జగనన్న గోరుముద్దలో భాగంగా మంగళవారం విద్యార్థులకు రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని జూపాడుబంగ్లా మోడల్ పాఠశాలలో తహసీల్దార్ పుల్లయ్యయాదవ్, ఎంపీపీ సువర్ణమ్మ, ఇన్‌చార్జి ఎంపీడీఓ మణిమంజరి, ఎంఈఓ మోహన్, సర్పంచ్ బాలస్వామి ప్రారంభించారు. మండలం వ్యాప్తంగా ఉన్న 38ప్రభుత్వ పాఠశాలల్లో రాగి జావ పంపిణీ నేటి నుంచి ప్రారంభించినట్లు ఎంఈఓ మోహన్ తెలిపారు.


పాములపాడు ఏఎస్‌ఆర్ జెడ్పీహెచ్‌లో థ్యాంక్యూ జగన్‌మామయ్య అంటూ రాగి జావ గ్లాసులు చూపుతున్న విద్యార్థినులు

కొత్తపల్లి: మండలంలోని దుద్యాల గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపీపీ కిచ్చన్నగారి కుసుమలత, సర్పంచు చందమాల శోభలత విద్యార్థులకు రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముసలిమడుగు పాఠశాలలో సర్పంచు జమిలాబీ, ఎంపీటీసీ ముబీనాబేగం రాగిజావ పంపిణీ చేశారు.

పగిద్యాల: మండలంలోని పడమర ప్రాతకోట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం తహసీల్దార్ భారతి, ఎంపీడీఓ వెంకటరమణ చేతుల మీదుగా విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేశారు. ఎంఈఓ సుభాన్ పాల్గొన్నారు.

వెలుగోడు: పట్టణంలోని జెడ్పీ హైస్కూల్, ఎంపీపీ స్కూల్, వికలాంగుల పాఠశాలలో సర్పంచ్ వేల్పుల జయపాల్, ఎంఈఓ బ్రహ్మంనాయక్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు ఇలియాస్ ఖాన్ రాగిజావ పంపిణీని ప్రారంభించారు.


నందికొట్కూరులో రాగిజావ పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ సుధాకర్ రెడ్డి


మాట్లాడుతున్న ఆత్మకూరు మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారుఫ్

ఆత్మకూరు: పట్టణంలోని ఉర్దూ బాలికల పాఠశాలలో రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్ ప్రారంభించారు.

మహానంది: తమ్మడపల్లెలో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని, జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి, మహానంది ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా పాలమహేశ్వరరెడ్డి విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేశారు.